
మహబూబాబాద్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు


కురవి వీరభద్రస్వామి దేవాలయంలో భక్తుల సందడి

నయా 2025 జోష్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- కొంగొత్త ఆశలతో కొత్త వసంతానికి స్వాగతం
- వాట్సాప్ ద్వారా, నేరుగా ఒకరికొకరు శుభాకాంక్షలు
- కేక్‌లు కట్‌చేసి, సంబరాలు జరుపుకున్న ప్రజలు
- ఆలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు

మహబూబాబాద్ టౌన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో వేడుకలను జరుపుకున్నారు. ప్రజలంతా పాత సంవత్సరం-2024 గుడ్‌బై చెప్పి, 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పాత సంవత్సరం చేదు జ్ఞాపకాలను వదిలి, మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరంలో అడుగు పెట్టారు. విద్యార్థులు, యువత, ప్రజలు ఆనందోత్సవాల నడుమ నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. 2025 సంవత్సరమంతా శుభమే జరగాలని ఆకాంక్షించారు.

డిసెంబరు 31న ఇయర్ ఎండింగ్ రోజున మిత్రులు బృందాలుగా ఏర్పడి కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతీ ఇంటిలో అర్ధరాత్రి సమయంలో కేక్‌లను కట్‌చేసి, వేడుకలను పండుగలా జరుపుకున్నారు. ఇక మహిళలు తమ ఇళ్ల ముంగిట్లో రంగురంగుల ముగ్గులు వేసి నూతన సంవత్సరాన్ని స్వాగతించారు. మిత్రులు, సన్నిహితులు బృందాలుగా ఏర్పడి నూతన సంవత్సర కేక్‌లను కట్ చేశారు. గతంలో ఎన్నడులేని విధంగా 2025 సంవత్సరానికి గ్రాండ్‌వెల్‌కమ్ చెప్పారు.

కొత్త సంవత్సరంలో అడుగు పెట్టిన ప్రజలు తమ స్నేహితులు, బంధువులు, సన్నిహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సెల్‌ఫోన్‌లు లేని సమయంలో ల్యాండ్‌ఫోన్‌లు, గ్రీటింగ్‌ల ద్వారా శుభాకాంక్షలు తెలిపేవారు. సాంకేతికాభివృద్ధి.. రానురాను ట్రెండ్ మారి మొబైల్ ఫోన్‌లు రంగప్రవేశం చేయడంతో కొంతమంది వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా, మరికొంత మంది నేరుగా ఫోన్‌లు చేసి న్యూఇయర్ విషెస్ తెలిపారు. ఒకే ఊరిలో నివసిస్తున్న అత్యంత సన్నిహితులు, ప్రాణస్నేహితులు, చిన్న నాటి మిత్రులకు స్వయంగా ఇళ్లకు వెళ్లి స్వీట్లు తినిపించి నోరు తీపి చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకుని, వేడుకల్లో భాగస్వాములయ్యారు. రాజకీయ పార్టీల నాయకులు తమ గాడ్‌ఫాదర్‌లు, ప్రజాప్రతినిధులను కలిసి వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సందడే.. సందడి..

కొత్త సంవత్సరం ఆరంభం బుధవారం రోజున ప్రతీ ఒక్కరు తమ కుటుంబసభ్యులతో కలిసి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పండుగ తరహాలో ఉదయాన్నే లేచి.. తలంటూ స్నానాలు ఆచరించి చిన్నారుల నుంచి పెద్దల వరకు నూతన దుస్తులను ధరించి, దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. 2025 సంవత్సరమంతా

మిగతా 8వ పేజీలో...


వీరభద్రస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కురవి, (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలను కురవి మండలంలో యువత ఘనంగా జరుపుకున్నారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, 2025 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం నుంచి, బుధవారం ఉదయం వరకు యువత సంతోషంగా గడుపుతూ ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని కురవి వీరభద్రస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజలు, వాహనపూజలు జరిపించుకున్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, తహసీల్దార్ సునిల్ రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు.


తిరుమల నర్సరీ అండ్ గార్డెన్స్‌లో కేక్‌ను కట్ చేస్తున్న నిర్వాహకులు బండారు వెంకటరమణ, కామ సంజీవరావు


ఎమ్మెల్సీ రవీందర్‌రావుకు బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఫుల్ కిక్కు



రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు

- ఒక్కరోజే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 38 కోట్ల వ్యాపారం
- గ్రేటర్ వరంగల్‌లోనే రూ.14 కోట్ల మద్యం దిగుమతి
- కల్చరల్ ఈవెంట్స్‌తో మరింత పెరిగిన ఆదాయం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

వరంగల్ కమిషనరేట్ 567	ములుగు 29
భూపాలపల్లి 26	
మహబూబాబాద్ 52	

వరంగల్ క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా మద్యం ప్రియులు జోష్‌లో మునిగితేలారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యంషాపుల్లో విక్రయాలు జరిపేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో మద్యం ప్రియులకు సాధారణ రోజులకన్న న్యూ ఇయర్ కిక్కెక్కించింది. వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్‌లు, ఇళ్లలోనే కాకుండా ఆనందాలు పంచేందుకు గ్రేటర్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన కల్చరల్ ఈవెంట్స్‌లలోనూ మద్యం విక్రయాలు భారీగానే జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ రోజుల్లో సగటున రూ.9 కోట్ల నుంచి 10 కోట్ల మద్యం సేల్ అయ్యేది. కాగా, డిసెంబరు 31 ఒక్క రోజునే సుమారు రూ. 38 కోట్లు మద్యం అమ్మకాలు జరిపినట్లు అబ్కారీ అధికారులు వెల్లడించారు. ఈ నెల 30, 31 రెండు రోజుల్లో సుమారు రూ.70 కోట్ల మద్యం సేల్ అయినట్లుగా సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన రూ. 38 కోట్ల సేల్స్‌లో ఒక్క గ్రేటర్ పరిధిలోని వైన్స్, బార్ షాపుల నిర్వహకులు రూ. 14 కోట్ల మద్యాన్ని దిగుమతి చేసుకున్నట్లుగా అబ్కారీ రికార్డులు చెప్తున్నాయి.

జోరుగా కల్చరల్ ఈవెంట్స్...

న్యూఇయర్ వేడుకలను పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన కల్చరల్ ఈవెంట్స్‌లోనూ మద్యం ఏర్పాటు చేయడంతో

మిగతా 7వ పేజీలో...


మానుకోటలోని ఎక్సైజ్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

'బెల్ట్‌షాపులను నియంత్రించాలి'

- ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆందోళన

మహబూబాబాద్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలు నిరోధించి, మద్యం బెల్ట్‌షాపులను నియంత్రించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, వన్‌టౌన్ కార్యదర్శి రావుల రాజు కోరారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు, మద్యానికి బానిసై తమ బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖపై ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వడంతో ఎక్కడ పడితేఅక్కడ బెల్ట్‌షాపులు వెలిశాయని.. తద్వారా పల్లెల్లో మద్యం ఏరులై పారుతుందని చెప్పారు. మద్యానికి బానిసై అనేక మంది జీవితాల్లో చీకట్లు అలుముకుంటున్నాయని బెల్ట్ షాపుల నియంత్రణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చీపిరి యాకయ్య, హేమానాయక్, శాగంటి భాగ్యమ్మ, తోట శ్రీనివాస్, లాలయ్య, వెంకన్న, ఉపేంద్ర, వీరభద్రం, శ్రీనివాస్, దేవేందర్, యాకన్న, మల్లేష్, బాబు, భద్రాషి తదితరులు పాల్గొన్నారు.

రూ.7 కోట్లతో ఇనుగుర్తి హైస్కూల్ అభివృద్ధి

- గాయత్రి గ్రానైట్స్ నుంచి రూ.కోటి విరాళం
- రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా మారుస్తా
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఇనుగుర్తి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే ఆదర్శవంతంగా ఇనుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలను రూ.7 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రకటించారు. బుధవారం ఇనుగుర్తిలోని పాఠశాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తాను పుట్టిపెరిగిన ఊరు, చదువుకున్న పాఠశాల ఇదేనని గుర్తు చేశారు. సిరిసిల్ల, నిజామాబాద్‌లో ఉన్న మాదిరిగా ఈ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు తమ తల్లిదండ్రులు నారాయణ-వెంకటనర్సమ్మల జ్ఞాపకార్థం గాయత్రి గ్రానైట్స్ సంస్థ నుంచి రూ.కోటి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మిగతా అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రూ.7 కోట్లతో అంచనాలను రూపొందించినట్లు చెప్పారు. నూతన భవనాలు, వాలీబాల్ క్రీడ కోసం మైదానాలు, పార్కు తదితర ఆధునాతన సౌకర్యాలతో రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలగా ఈ ఏడాదిలోనే స్కూల్‌గా రూపురేఖలను ఊహించని విధంగా మార్పు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో జూనియర్ కళాశాలగా ఉన్నతీకరించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లను సైతం చేయనున్నట్లు చెప్పారు. తాను కేంద్ర పెట్రోలియం అండ్ నేచరల్ గ్యాస్‌లో స్టాండింగ్ కమిటీ, బొగ్గు గనులశాఖ కన్సల్టేటివ్ సభ్యుడిగా ఉన్నానని, తనకు పరిచయం ఉన్న ఎంపీ మిత్రుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, సొసైటీ చైర్మన్ ధీకొండ వెంకన్న, బేతమల్ల చంద్రయ్య, వద్దిరాజు వెంకటేశ్వర్లు, గండు నాగన్న, గుజ్జునూరి బాబురావు, మాలోత్ మంగ్యానాయక్, పింగిళి శ్రీనివాస్, ఒద్దిరాజు వసంతరావు పాల్గొన్నారు.

జేఈఈ, నీట్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ఇనుగుర్తిలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తల్లిదండ్రులు నారాయణ, వెంకటనర్సమ్మల వర్ధంతి సందర్భంగా బుధవారం విద్యార్థులకు జేఈఈ, నీట్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంపీ రవిచంద్రతో పాటు ఆయన సోదరులు వద్దిరాజు కిషన్, దేవేందర్, మోహన్, పెద్దవెంకటేశ్వర్లు, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఇనుగుర్తి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- ఇన్‌చార్జి డీటీవో జయపాల్‌రెడ్డి


మహబూబాబాద్ డిపోలో జయపాల్‌రెడ్డికి మెమెంటోను అందజేస్తున్న ఆర్టీసీ డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు వాహనాలను నడిపే సమయంలో తగిన జాగ్రత్తలను పాటించాలని ఇన్‌చార్జి జిల్లా రవాణా అధికారి (డీటీవో) జయపాల్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన హాజరై మాట్లాడారు. వర్షాకాలం, చలికాలంలో జాగ్రత్తగా వాహనాలను నడపాలని రోడ్డుసేఫ్టీ ముఖ్యమని చెప్పారు. మానుకోటఆర్టీసీ డిపోమేనేజర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా డ్రైవర్లు వాహనాలను నడుపుతున్నారని చెప్పారు. మున్ముందు కూడా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు సాయిచరణ్, వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు శ్రీనివాస్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏల సమస్యలను పరిష్కరించాలి

- టీపీజేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ శ్రీనివాస్
- 23వ రోజుకు చేరిన సమ్మె

8





గోపా సేవలు అభినందనీయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

తొర్రూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గోపా ఆధ్వర్యంలో నిర్వహించే సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోపాఆధ్వర్యంలో చేస్తున్న సేవలను ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తొర్రూరులో ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అణగారిన వెనకబడిన ప్రజల ఐక్యతకు కృషి చేస్తూ, సమాజ అభివృద్ధి దిశగా పయనించే విధంగా ప్రయత్నించాలని కోరారు. పేద ప్రజల కోసం గౌడ సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సేవలను మరింత విస్తృత పరచాలని, ప్రతీ ఒక్కరికి సేవా కార్యక్రమాలు అందేవిధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు టి.రమేష్, దేశగాని కుమార్, రాయిపెల్లి యాకయ్య, ఎంఈవో బుచ్చయ్య, దీకొండ శ్రీను, నర్సయ్య, ప్రవీణ్, హేమాద్రి, దూలం శ్రీను, మహేష్, శ్రీనివాస్, భిక్షం పాల్గొన్నారు.

'ఖర్సావన్' ఆదివాసీ అమరులకు నివాళి



కొత్తగూడలో నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

కొత్తగూడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తూ బిహార్, ఒడిషా సరిహద్దులోని ఖర్సావన్‌లో 1948 జనవరి 1న ఆదివాసీలు ఏర్పాటు చేసుకున్న సభలో పోలీసులు విచక్షణ రహితంగా జరిపిన కాల్పుల్లో 50వేల మంది ఆదివాసీలు మృతిచెందగా.. ఆఘటనకు సూచికంగా తుడుందెబ్బ ఆధ్వర్యంలో కొత్తగూడలో బుధవారం ఆదివాసీ అమరులకు మౌనం పాటించి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం వద్ద తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల రాము మాట్లాడారు. నాటి కాల్పుల్లో మృతి చెందిన ఆదివాసీల శవాలను బావిలో వేసి, దానిని మూసివేయించారని ఆరోపించారు. ఇలాంటి హృదయవిదారక ఘటన చరిత్రకు ఎక్కకుండా పాలకులు కుట్రలుచేశారన్నారు. అందుకే జనవరి 1న ఆదివాసీలు బ్లాక్‌డే పాటిస్తారని పేర్కొన్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టంవచ్చి నేటికి 18ఏళ్లని పేర్కొన్నారు. కానీ, ఉమ్మడి కొత్తగూడ మండలంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం పూర్తిగా అమలు కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టంను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లెల సారయ్య, నాయకులు కల్తీ వీరాస్వామి, సతీష్, హరీష్, ఆదివాసీ రచయితల వేదిక సభ్యుడు గుమ్మడి లక్ష్మీనారాయణ, ఆదివాసీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వాసం కిషిందర్, సిద్దబోయిన లక్ష్మీనారాయణ, ఈసం సమ్మయ్య, సువర్ణపాక రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ



దేవాలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆలయ తాంత్రి విష్ణునారాయణపొట్టి

కేసముద్రం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అయ్యప్పదేవాలయంలో స్థానిక గాయత్రి జువెల్లర్స్ యజమాని బోగోజు వేణుగోపాలాచారి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆలయ ప్రధాన తాంత్రి విష్ణు నారాయణపొట్టి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం సాయిదుర్గ కుటీరం అయ్యప్ప స్వాములు గురుస్వామి కొత్తపల్లి శేఖర్ ఆధ్వర్యంలో ఇరుముడిని ధరించి శబరి యాత్రకు బయలుదేరారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ పీఎస్‌టీలు వోలం చంద్రశేఖర్, పొలెపల్లి యాకూబ్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

పనులు చేయకుండా ప్రకటనలు సిగ్గుచేటు

- ఎమ్మెల్యే కడియంను ప్రజలు ఛీదరించుకుంటున్నారు
- ఉప ఎన్నిక వస్తే ఓడించడానికి సిద్ధంగా ఉన్నారు..
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఏడాది పాలనలో ఏ ఒక్క అభివృద్ధి పనిచేయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెయ్యి కోట్ల అభివృద్ధి పనుల అని రోడ్లపై ప్రకటన బోర్డులు పెట్టుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెబుతున్న కడియం అభివృద్ధి ప్రకటనలు చేశారు తప్పా ఏ ఒక్కటీ ప్రారంభించి, పూర్తిచేయలేదని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా మారుస్తూ ప్రకటన వచ్చే క్రమంలో కడియం అడ్డుపడ్డాడని తెలిపారు. 100 పడకల ఆస్పత్రికి జీవో విడుదలైనప్పటికీ దానికి అడ్డుపడి తానేదో తెస్తున్నట్లు మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. శ్రీహరికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి కాంగ్రెస్‌పార్టీ నుంచి గెలుపొందాలన్నారు. ఇప్పటికే ఆయనను నియోజకవర్గంలో ప్రజలు ఛీదరించుకుంటున్నారని, ఉప ఎన్నిక వస్తే ఓడించాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని సీఎంగా ఆయన అట్టర్‌ప్లాఫ్ అయ్యారన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు కనకం గణేష్, తాటికొండ సురేష్, బాబు, చింత శ్రీనివాస్, ఆకుల నర్సింహులు, గుండె మల్లేషం, అకారపు అశోక్, గుర్రం శంకర్, ఏసుబాబు, దేవయ్య, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో జిల్లాకు మూడు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కాశిబుగ్గ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు వేట కొనసాగిస్తున్నారు. తాజాగా ఆర్చరీ పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి భేష్ అనిపించుకున్నారు. ఇప్పటికే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జూడో, స్వర్ణంతో పాటు మరో మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. ఖమ్మంలో జరిగిన ఆర్చరీ పోటీల్లో జిల్లాకు చెందిన రఫికా స్వర్ణ పతకాన్ని, అచ్యుత్ రజత, మన్సురా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. రఫికా, మన్సురా దేశాయిపేటలోని ఏవీఆర్ అర్చరీ అకాడమి క్రీడాకారులు కాగా, అచ్యుత్ కల్లెడలోని ఆర్‌డీఎఫ్ అర్చరీ అకాడమి క్రీడాకారుడు. వీరిని డీవైఎస్‌వో సత్యవాణి, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ ఇండియా జట్టు కోచ్‌గా విష్ణువర్ధన్



వరంగల్ స్పోర్ట్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : లక్నోలో ఈ నెల 3నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే పురుషుల జట్టుకు ఇండియ కోచ్‌గా హనుమకొండ డీఎస్ఏ హ్యాండ్‌బాల్ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్ నియామితులయ్యారు. ఈ మేరకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తేజ రాజ్‌సింగ్ బుధవారం నియామక ఉత్తర్వులను జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖిలా వరంగల్‌కు చెందిన విష్ణువర్ధన్ ప్రస్తుతం హనుమకొండ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జేఎన్ క్రీడా మైదానంలో హ్యాండ్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన నియామకానికి సహకరించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ ఈశ్వర్‌పాండే, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.జగన్‌మోహన్‌రావు, సాట్ సీఎండీ సోనీ బాలదేవి, సాట్ డిప్యూటీ డైరెక్టర్ జి. రవీందర్, హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్‌తో పాటు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులకు, వివిధ క్రీడా సంఘాల ప్రతి నిధులకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె బాట



చిట్యాల సివిల్ సప్లయ్ గిడ్డంగి ముందు సమ్మె చేస్తున్న హమాలీ కార్మికులు

చిట్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయ్ హమాలీలు సమ్మె బాట పట్టారు. గత ఏడాది అక్టోబరులో జరిగిన ఒప్పందం ప్రకారం కొత్త కూలిరేట్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. ఈసందర్భంగా సివిల్ సప్లయ్ హమాలీ సంఘం అధ్యక్షుడు సరిగొమ్ముల సురేష్ మాట్లాడుతూ హమాలీల శ్రమను గుర్తించి ఒప్పంధం ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి కూలి రేట్లు పెంచాల్సి ఉందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా క్వింటాలుకు రూ.35 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, ఇన్సురెన్సు సౌకర్యం కల్పించాలన్నారు. హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీలు ఆరెపెల్లి సమ్మయ్య, గుర్రపు నర్సయ్య, దాసారపు సాంబయ్య, శీలపాక నాగరాజు, మొలుగూరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి 6నుంచి 9వ తరగతి వరకు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని గాంధీనగర్ గిరిజన సంక్షేమ గురుకులపాఠశాల ప్రిన్సిపాల్ టి.కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఆగస్టు 31 తేదీ వరకు 5వ తరగతి విద్యార్థులు 13 సంవత్సరాలు, 6వ తరగతికి 14 ఏళ్లు, 7వ తరగతికి 15 ఏళ్లు, 8వ తరగతికి 16 ఏళ్లు, 9వ తరగతికి 17 సంవత్సరాలు వయస్సు ఉండాలన్నారు. 'ఆన్‌లైన్‌'లో ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి'



మాట్లాడుతున్న ఎంవీఐ సాయిచరణ్

తొర్రూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు పాటిస్తూ డ్రైవర్లు వాహనాలు నడపాలని ఎంవీఐలు సాయిచరణ్, వెంకట్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం తొర్రూరు ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. చలికాలంలో పొగమంచు ఎక్కువ ఉన్నందున జాగ్రత్తగా ప్రమాదాలు జరగకుండా బస్సులు నడపాలన్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేప్పుడు హెల్మెట్ ధరించాలని, ప్రతీ ఒక్కరు రోడ్‌సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా డ్రైవర్లు యోగా చేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. నెలరోజుల పాటు జరగనున్న ఈ వారోత్సవాల్లో సిబ్బందికి మరోమారు అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పద్మావతి, ఎస్టీఐ రజిత, ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన టీజీబీ సేవలు



తొర్రూరులో టీజీబీగా మారిన ఏపీజీవీబీ

తొర్రూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లు (ఏపీజీవీబీ) ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంకులుగా మారిన నేపథ్యంలో బుధవారం నుంచి బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. భారత ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు ఏపీజీవీబీ కార్యకలాపాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వారీగా విభజన అయింది. తెలంగాణ రాష్ట్రంలో ఏపీజీవీబీలను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేసే నేపథ్యంలో బ్యాంకు అధికారులు సేవలు విస్తృతంగా అందిస్తామన్నారు.

గత నెల 28న నిలిచిపోయిన సేవలు

2024 డిసెంబరు 28 నుంచి 31 వరకు అంతర్గత పనుల నేపథ్యంలో బ్యాంకు సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. బుధవారం జనవరి 1 నుంచి బ్యాంకు సేవలు యథావిధిగా అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకు పేరు మారినా ఖాతా నంబర్లు మారవు. యూపీఐ సేవల కోసం కొత్తగా టీజీబీ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ నంబర్ (బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో) లేదా తెలంగాణ గ్రామీణ డెబిట్ కార్డు ఉపయోగించి యూపీఐ కోసం దరఖాస్తు చేసుకోవాలి. పాత ఏటీఎం స్థానాల్లో కొత్తవి తీసుకోవాల్సి ఉంటుంది. ఖాతా దారులు మొబైల్ ఫోన్‌లలో తెలంగాణ గ్రామీణ మొబైల్ బ్యాంకు అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని గత వివరాలతో లాగిన్ కావాలి.

విస్తృత సేవలు అందిస్తాం

పి.నవీన్‌కుమార్, టీజీబీ మేనేజర్ తొర్రూరు



తెలంగాణ గ్రామీణ బ్యాంకులుగా ఆవిర్భవించిన నేపథ్యంలో ఖాతాదారులకు మరిన్ని సేవలతో పాటు సేవలను విస్తృతం చేస్తాం. నూతన సాంకేతికతతో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందిస్తాం. ఖాతాదారులు ఆన్‌లైన్ అప్లికేషన్ సేవల కోసం నూనత ఏటీఎంలను తీసుకోవాల్సి ఉంటుంది. పాత ఏటీఎంలు పనిచేయవు. సేవలు విస్తృతమయ్యేవరకు ఖాతాదారులు సహకరించాలి.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



సాంబయ్య (ఫైల్)

వరంగల్‌సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల సుందరయ్యనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ లాసాని సాంబయ్య (41) మంగళవారం రాత్రి హనుమకొండ భీమారం ఎస్‌వీఎస్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సాంబయ్య భీమారం కిరాయికి వెళ్లగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం బలంగా ఢీకొనడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 10.30 గంటల సమయంలో మృతిచెందారు. ఆయనకు భార్య అనిత, కుమారుడు సాయికిరణ్, కుమార్తె శ్రావణి ఉన్నారు.

అమీనాబాద్‌లో కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

చెన్నారావుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమీనాబాద్‌లో ఇంటిగ్రేటెడ్, కేంద్రీయ విద్యాలయం పాఠశాలల నిర్మాణం కోసం బుధవారం స్థల పరిశీలనను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టడంపై ఉన్నతాధికారులకు నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈడబ్ల్యూఎస్ ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ రవీందర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, యూత్ అధ్యక్షుడు బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తినాయక్‌తండాను కలపాలి

పత్తినాయక్ తండాను అమీనాబాద్ గ్రామంలోనే వీలినం చేయాలని పత్తినాయక్ తండాకు చెందిన తండవాసులు బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిశారు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పత్తినాయక్‌తండాలోని కొందరు వ్యక్తులు తమ కుటుంబ పాలన, వారసత్వపు రాజకీయాల కోసమే జీపీగా ఉండాలని అంటున్నారన్నారు. తండా వాసులు అందరు ఉమ్మడి అమీనాబాద్‌లో కలపాలని కోరుతున్నారన్నారు. తండాను జీపీగా మార్చడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పత్తినాయక్‌తండాను గతంలో మాదిరిగానే పరిపాలన అందించి అభివృద్ధి చేయాలన్నారు. తండావాసుల అభివృద్ధి కోసం తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కాక్యక్రమంలో దరావత్ రాములు రఘు, రవి, భీమా, నరేష్, రమేష్, స్వామి, విజయ్, గణేష్, శంకర్, గోపిసింగ్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో సీపీ అంబర్ కిషోర్ ఝా

కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనం

ఐనవోలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఐనవోలు మల్లికార్జున స్వామిని బుధవారం రాత్రి వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సీపీ జన్మదినం సందర్భంగా ఆలయానికి చేరుకుని స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు సీపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు సీపీ, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాలు చేసి లడ్డు, ప్రసాదం అందజేసి పట్టు వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మామునూరి ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డను చూడకుండానే తండ్రి మృతి

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన



రమేష్ మృతదేహం

డోర్నకల్(మహబూబాబాద్‌జిల్లా), జనవరి1 (ఆంధ్రజ్యోతి): కన్న కూతురుని చూడకుండానే అనారోగ్యంతో తండ్రి కన్నుమూశాడు. ఈ విషాదకరమైన ఘటన మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్ మండలంలోని ములకలపల్లి దళితవాడలో బుధవారం చోటు చేసుకుంది. దీనికి సంబం ధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ములకలపల్లి దళితవాడకు చెందిన కన్నెగంటి రమేష్(30) కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటూ.. భార్య మౌనిక పెద్దకూతురు సాహితిని పోషించుకుంటున్నారు. కడు నిరుపేద అయిన రమేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. నాలుగు రోజుల కిందట రమేష్ భార్య మరో కూతురుకు జన్మనిచ్చింది. భార్య కూతురు ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండగానే రమేష్ తన ఇంటివద్ద బుధవారం కన్నుమూశాడు. కన్న కూతురు కళ్లు తెరిచి తండ్రిని చూడలేదు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్ కూడా కన్న కూతురిని చూడలేదు. కన్న కూతురుని చూడకుండానే నువ్వు వెళ్లి పోయావా అంటూ రమేష్ భార్య బంధువులు రోధిస్తున్న తీరును చూసి గ్రామస్థులు కన్నీరు పెట్టుకున్నారు. కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని బంధువులు కోరుతున్నారు. ఫోన్ పే నెంబర్ 96523 92858 పంపగలరని వారు కోరుతున్నారు.

ఉరి వేసుకుని ఒకరి బలవన్మరణం



కృష్ణ (ఫైల్)

గణపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిలుమోజు కృష్ణ(26) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం 7గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటంబసభ్యులు 108 ద్వారా భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే కృష్ణ మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

బావిలో పడి ఒకరు మృతి




విజయ్‌కుమార్ (ఫైల్)

సీరోలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ముడుసు విజయ్‌కుమార్ (35) పొలానికి నీళ్ల పెట్టేందుకు వ్యవసాయ బావివద్దకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ చేసి పైపు నుంచి నీళ్ల వస్తున్న క్రమంలో పైపును సరిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. బావికి సమీపంలో పశువులు మేపుతున్న సుకుమార్ అనే వ్యక్తి విజయ్‌కుమార్ బావిలో పడిన విషయాన్ని గమనించినట్లు తెలిపారు. సుకుమార్ సమీపంలో ఉన్న వ్యక్తులను పిలిచి చూసేసరికి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపినట్లు వివరించారు. తల్లి మేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు. మృతుడికి భార్య ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

- తల్లి మందలించడంతో బలవన్మరణం




సాయికిరణ్ (ఫైల్)

వాజేడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగొద్దని తల్లి మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. వాజేడు ఇన్‌చార్జ్ ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కంతి సాయికిరణ్(22) మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకల్లో మద్యం తాగాడు. ఈ క్రమంలో చర్చి ప్రార్థనలో ఉన్న అతని తల్లి కంతి జానకమ్మ, భార్యకు మద్యం తాగి కనిపించాడు.దీంతో మద్యం ఎందుకు తాగుతున్నావని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సాయికిరణ్ ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున సాయి కిరణ్ మృతి చెందాడు.

గుండెపోటుతో రైతు మృతి

- బైపాస్ రోడ్డులో భూమి పోతోందని మనస్తాపం
- కుటుంబ సభ్యుల ఆరోపణ



రాజబీరయ్య (ఫైల్)

పోచమ్మమైదాన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లికి చెందిన రైతు దయ్యాల రాజబీరయ్య(62) గుండె పోటుతో మృతి చెందాడు. రెండు రోజుల క్రితం ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా గుండెనొప్పిరావడంతో బుధవారం మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ 'కుడా' అధికారులు ఇటీవల ప్రతిపాదించిన ఐఆర్ఆర్ బైపాస్ రోడ్డులో తన జీవనాధారమైన ఎకరం 20 గుంటల పంట భూమి పోతోందని, దాన్ని మార్చాలని కొన్ని రోజులుగా అందరితో కలిసి ఆయన అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, ఈ క్రమంలో తనకు గుండెపోటు వచ్చిందని, అధికారుల తీరు ఒక ప్రాణం తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.



నయా జోష్



వేయిస్తంభాల ఆలయంలో బారులుదీరిన భక్తులు

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

- అర్ధరాత్రి నుంచే మిన్నంటిన సంబరాలు
- బేకరీలు, స్వీట్ షాపుల్లో జోరుగా అమ్మకాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ముంగిళ్లలో న్యూ ఇయర్ ముగ్గులు

వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యువత, చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆనందోత్సవాలతో ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే సెల్‌ఫోన్లలో మెస్సేజ్‌లు, ఫోన్లు చేసి శుభాకాంక్షలు తెలుపుకొని నూతన సంవత్సర వేడుకలను ప్రారంభించారు. కాలనీలు, అపార్ట్‌మెంట్స్‌ల్లో యువత కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. స్పీకర్లు ఏర్పాటు చేసుకొని డీజే పాటలతో అదరగొట్టారు. హ్యాపీ న్యూ ఇయర్ సంబరాలు నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముంగిట హ్యాపీ న్యూ ఇయర్ ముగ్గులు వేశారు. రంగురంగుల ఆకృతులతో ముగ్గులతో ముంగిళ్లు సందడిగా కనిపించాయి. తెల్లవారు జాము నుంచే యువతులు ఇళ్ల ముంగిట వివిధ రకాల ముగ్గులను ఆకర్షణీయంగా వేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే బేకరీలలో, స్వీట్ షాపుల్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. బుధవారం ఉదయం నుంచి స్వీట్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

వేయి స్తంభాల ఆలయంలో...

నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయం, భద్రకాళి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి వేచి చూస్తే తప్పా దర్శనభాగ్యం కలగలేదు. వేయిస్తంభాల ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉత్తిష్ట గణపతికి హరిద్రా కుంకుమ, విలేపనంతో 51 కిలోల పెరుగుతో అభిషేకం నిర్వహించారు. పాశుపద మూలమంత్ర యుక్తంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయానికి తరలివచ్చిన భక్తుల క్యూలైన్లు కిలోమీటర్ పొడవు మెయిన్‌రోడ్డుకు తాకడం విశేషం. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు మంచినీటి వసతితోపాటు క్యూలైన్‌లో ఇబ్బంది పడకుండా ఈవో వెంకటయ్య పర్యవేక్షించారు. గంగు ఉపేంద్రశర్మతోపాటు మణికంఠశర్మ, ప్రణవ్‌లు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. నగర సమీపంలోని ఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రంగనాయక స్వామి దేవాలయం కూడా భక్తులతో కిటకిటలాడింది. ఈ క్రమంలో బుధవారం వరంగల్ నగర వైష్ణవ మహిళా సేవా సమితి కృష్ణమీనన్ ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. నగర పరిసరాల్లోని న్యూశాయంపేట దోనెగుట్ట లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయాన్ని కూడా పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శించారు. హనుమకొండ నక్కలగుట్టలోని వికాస తరంగిణి కార్యాలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని కీర్తిస్తూ మంగళహారతులతో స్వాగతించారు. అదే విధంగా హనుమకొండ బ్రాహ్మణవాడలోని దొప్ప లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, శ్రీ హనుమద్గిరి సమేత రంగనాయక ఆలయం, చిన్నకోవెల, ఎక్సైజ్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయం, రెవెన్యూ రామాలయం, కాజీపేటలోని శ్వేతార్క గణపతి ఆలయాలను కూడా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.



భద్రకాళి ఆలయంలో భక్తులు

పూజలు చేసిన ఎమ్మెల్యే నాయిని..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో శేషు భారతి, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు గోపాల్ నవీన్‌రాజ్ కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, పలువురు వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కేక్‌లు, స్వీటు షాపులు కిటకిట

హనుమకొండ : పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే క్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాలో పలు రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. మాంసం, స్వీట్లు, కేక్‌లు, అలంకరణ వస్తువులు, వస్త్రాలు, రంగులు, బాణాసంచా, హోటళ్లు, ఇలా అన్ని రకాల వ్యాపార కూడళ్లు జన సందోహంతో నిండిపోయాయి. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా కేక్‌లు, స్వీట్లు, కూల్ డ్రింకులు పెద్ద ఎత్తున అమ్మకమయ్యాయి. వీటి మీదనే రెండు జిల్లాల్లో రూ. 3 కోట్ల వరకు వ్యాపారం జరిగి ఉండవచ్చునని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. నూతన సంవత్సర వేడుకల్లో మద్యం తర్వాత ప్రధాన పాత్ర పోషించేది కేకులు, స్వీట్లు, శీతల పానీయాలే. కేకుల కోసం వారం రోజుల ముందు నుంచే అన్ని బేకరీ షాపులకు పెద్ద ఎత్తున ఆర్డర్లు వెల్లువెత్తాయి. కొత్త సంవత్సరం రోజు భారీ మొత్తంలో రకరకాల కేకులు అమ్మకమయ్యాయి. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని బేకరీ నిర్వాహకులు కొనుగోలుదారుల అభిరుచులకు తగ్గట్టు రకరకాల కేకులను తయారు చేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. ఉదయం నుంచే కేకులు హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. స్వీట్ల వ్యాపారం కూడా జోరుగా సాగింది. రెండు జిల్లాలో సుమారు రూ. 4 కోట్ల వరకు ప్రజలు ఖర్చుపెట్టి ఉంటారని భావిస్తున్నారు. కూల్ డ్రింక్‌లు కూడా పెద్ద ఎత్తున అమ్మకమయ్యాయి. కొత్త సంవత్సరం రోజు అలంకరణ వస్తువులు, ఇళ్ళ ముందు ముగ్గులు వేయడానికి రంగులు, గిఫ్టులు, కొత్త దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోళ్ల వ్యాపారం కూడా రూ. 4 కోట్ల వరకు జరిగి ఉంటుందని లెక్కలు వేస్తున్నారు.

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



భద్రకాళి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దేవత భద్రకాళి అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక రుసుముతో వీఐపీ దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. సర్వదర్శనం లైన్ మొదటి గేటు వరకు నిలిచింది. వాహనాలతో ప్రధాన రహదారి కిక్కిరిసి పోవడంతో చివరికి బైక్‌లను సైతం నిలిపివేశారు.



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

కళకళలాడిన పర్యాటకం

- లక్నవరం, రామప్పకు టూరిస్టుల తాకిడి
- నెలరోజుల ముందే రిసార్టుల బుకింగ్.. కాటేజీలన్నీ ఫుల్
- మేడారంలోనూ భక్తుల కోలాహలం



లక్నవరం మూడో ద్వీపంలోని కాటేజీలో పర్యాటకుల సందడి

ములుగు/వెంకటాపూర్/మేడారం, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలతో ములుగు జిల్లాలోని పర్యాటక కేంద్రాలు కళకళలాడాయి. వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం, తాడ్వాయి మండలంలోని మేడారం, గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్ద సందడి నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్నవరంలో నెలరోజుల ముందే రిసార్టులు, కాటేజీలను బుక్ చేసుకున్నారు. ఇక్కడి లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లలో విడిది చేసి ఎంజాయ్ చేశారు. ప్రత్యేక ఈవెంట్లేవీ నిర్వహించనప్పటికీ ప్రకృతి ఒడిలో సేదతీరారు. క్యాంప్ ఫైర్ వేసుకొని అర్ధరాత్రి వరకు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. తీరొక్క వంటకాలు, లిక్కర్‌తో ఛిల్ అయ్యారు. క్రిస్మస్ నుంచి వరుసగా సెలవులు రావడం మధ్యలో న్యూ ఇయర్ వేడుకలతో రిసార్టుల నిర్వాహకులకు బాగానే గిట్టుబాటైంది. మరో వారం రోజుల్లో సంక్రాంతి సెలవులు కూడా ఉండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న హోటళ్లు, చిరు వ్యాపారాలు కూడా బాగా నడిచాయి.

పుణ్యక్షేత్రాల వద్ద సందడి

ప్రభుత్వం బుధవారం సెలవు ఇవ్వడంతో జిల్లాలోని రామప్ప, మేడారం, మల్లూరు క్షేత్రాలను భక్తులు దర్శించుకున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా పెద్దసంఖ్యలో సందర్శించారు. నూతన సంవత్సర మొదటిరోజును పురస్కరించుకుని భక్తులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఏడాది అంతా మంచి జరగాలని వేడుకున్నారు. అనంతరం ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి ఆలయ చరిత్ర, విశిష్ట గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించి ఆనందంగా గడిపారు. నూతన సంవత్సరం సందర్భంగా మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వనదేవతల ప్రీతి రోజైన బుధవారం కావడం, న్యూ ఇయర్ సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో చేరుకుని తల్లుల దర్శించుకున్నారు

కాళేశ్వరంలో భక్తుల సందడి



క్యూలైన్‌లో నిలుచున్న భక్తులు

మహదేవపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని ఆంగ్లనూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు బుధవారం భారీ సంఖ్యలో సందర్శించారు. ఉదయం నుంచే గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారి సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాసక రుద్రాభిషేకం, శుభానందదేవికి కుంకుమ పూజలు, సరస్వతిదేవికి పలు ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరం సెలవుదినం కావడంతో తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలు తరలివచ్చారు. ఈ సంవత్సరం మంచి జరగాలని నవగ్రహ, కాలసర్ప పూజలు నిర్వహించారు.

ఫుల్ కిక్కు...

5వ పేజీ తరువాయి

మద్యం ప్రియులు ఫుల్ ఎంజాయ్ చేశారు. ఈవెంట్స్ నిర్వహకులు ఏర్పాటు చేసిన వినోదాలను వీక్షించుతూ కుటుంబసభ్యుల మధ్య కిక్కును ఆస్వాదించారు. నక్కలగుట్ట హరిత హోటల్, సుబేదారిలోని ఆఫీసర్ క్లబ్, హంటర్ రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈవెంట్స్‌లలో మద్యం అందుబాటులో పెట్టడంతో మద్యం ప్రియులు కుటుంబసభ్యుల కేరింతల మధ్య ఈవెంట్స్ నిర్వహకులు వేసే పాటలకు స్టెప్పులు వేస్తూ మద్యం మత్తులో మునిగితేలారు. కుటుంబసభ్యులు సైతం కొత్త అనుభూతిని పొందుతూ మద్యం ప్రియులు వేసే నృత్యాలకు ఫిదా అయిపోయారు. ఇళ్లలో అయితే మద్యం కిక్కు చెప్పనక్కర్లేదు బ్యాచ్‌లర్ రూమ్స్‌లతో పాటు లాడ్జిలు, బాయ్స్ హాస్టల్స్‌లో మద్యం ప్రియులు ఎంజాయ్ చేశారు.

అడుగడుగునా తనిఖీలు

న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఏలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు పకడబ్బందీగా చర్యలు చేపట్టారు. గత ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధితో పాటు మిగతా జిల్లాలైన భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ఏరియాల్లో పోలీసులు 9 గంటల కే రోడ్లెక్కి భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రధాన కూడళ్లు, గల్లీలు, మండలాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి ఏలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేసి వాహనాలతో రోడ్డుపైకి వచ్చిన వాహనదారులకు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. కమిషనరేట్ పరిధిలో సుమారుగా 300 వాహనాలను సీజ్ చేశారు. వరంగల్ ట్రైసిటీలో ట్రాఫిక్ పోలీసులు 325 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా, మూడు జోన్‌లలో లా అండ్ ఆర్డర్ పోలీసులు 242 కేసులు నమోదు చేశారు. గతంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు ముందస్తుగా పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడంతో మందుబాబులు ఎవరు వాహనాలపై రోడ్డులపైకి రావడానికి ధైర్యం చేయలేదు. న్యూ ఇయర్ సందర్భంగా ఏలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 674 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.



ప్రథమ స్థానంలో నిలిచిన హైదరాబాద్ జట్టు

ముగిసిన ఖోఖో పోటీలు

పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు విజేత


కాశిబుగ్గ, జనవరి1 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఓ సిటీ స్టేడియంలో జరిగిన ఈ పోటీలు డిసెంబరు 30న ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన జట్లు తలపడ్డాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 64మంది రెఫరీలు పోటీలను నడిపించారు. చివరి రోజు బుధవారం రాత్రి వరకు పురుష, మహిళల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పురుషుల ఫైనల్ మ్యాచ్ హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్ల మధ్య జరిగింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు ద్వితీయ స్థానానికి పరిమితమైంది. మూడు, నాలుగో స్థానాల్లో అదిలాబాద్, నిర్మల్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో ఫైనల్ మ్యాచ్ కొమురంభీం అసిఫాబాద్, నల్గొండ జట్లు తలపడగా, అసిఫాబాద్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. నల్గొండ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల జట్లు మూడో, నాలుగో స్థానాలకు పరిమితమయ్యాయి. ఫైనల్ మ్యాచ్‌లు విద్యుత్ వెలుగుల మధ్య రాత్రి వరకు కొనసాగాయి.

శ్రీవారికి అక్షర నీరాజనం

416 కీర్తనలను ఆంగ్లంలోకి అనువాదం చేసిన రాజగోపాలాచారి


వేంకటేశ్వరుడి కీర్తనలతో పాటు ఇతర గ్రంథాల ట్రాన్స్‌లేషన్

సప్తగిరి సంపాదక బోర్డులో సభ్యుడిగా సేవలు



టీటీడీ ప్రచురించిన వల్లభాచార్య గ్రంథం ఆంగ్లానువాదం

హనుమకొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మమొక్కటే.. పర బ్రహ్మమొక్కటే.. తందనాన భళా తందనానా..' వంటి అనేక కీర్తనలను తేట తెలుగులో అలతి పదాలతో అద్భుతంగా రాసి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని అన్నమయ్య అర్చించగా... ఆ కీర్తనలను విశ్వవ్యాప్తం చేసే కృషిలో భాగంగా వాటిని ఆంగ్లంలోకి అనువదించడం ద్వారా ఆచార్య మాఢభూషణం రాజగోపాలాచారి ఆశ్రీవారికి అనువాద నీరాజనం అర్పిస్తున్నారు. ఇప్పటికే 416 అన్నమయ్య కీర్తనలను ఆంగ్లంలోకి అనువదించిన రాజగోపాలాచారి స్వామి వారికి సంబంధించిన పలు గ్రంథాలను సైతం ఆంగ్లానువాదం చేస్తూ సాహితీ సేవలో తరిస్తున్నారు. అన్నమయ్య కీర్తనలపై లోతుగా పరిశోధన చేసిన ఆయన అనువాద ప్రక్రియలో తనదైన ముద్ర వేశారు. అన్నమయ్య కీర్తనలపై గతంలో వచ్చిన అనువాదాల్లో లోపించిన మన సంస్కృతి, సాంప్రదాయాల ఆత్మకు అద్దం పట్టిన రాజగోపాలాచారి ఆంగ్లానువాద ప్రస్థానం సుదీర్ఘం.



రాజగోపాలాచారి అన్నమయ్య కీర్తనల అనువాద పుస్తకం

పరిశోధన

కాకతీయ విశ్వవిద్యాలయంలో 38 సంవత్సరాలు పనిచేసి 2013లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ పొందిన రాజగోపాలాచారి ఆంగ్ల సాహిత్యంలో ఎన్నో పరిశోధనా వ్యాసాలు, విమర్శనా గ్రంథాలు రాశారు. అలాగే తెలుగులో నుంచి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుంచి తెలుగులోకి ఎన్నో అనువాదాలు చేశారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ తర్వాత భక్తిసాహిత్యం, అన్నమయ్య పదాలు, తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సంబంధించిన వ్యాసాలు, గ్రంథాలను సైతం అనువాదం చేశారు. 2015లో యూజీసీ ఎమిరేటస్ ప్రొఫెసర్‌గా ఎంపికై రెండు సంవత్సరాల ప్రాజెక్టులో భక్తిసాహిత్యంలో సమతావాదం, అన్నమయ్య సంకీర్తనల ప్రత్యేక పరిశీలన అన్న అంశంపై విస్తృత పరిశోధన చేశారు. అందులో భాగంగానే పలు అన్నమయ్య సంకీర్తనలను ఆంగ్లంలోకి అనువదించారు. 2020లో ఆథర్స్ ప్రెస్, న్యూఢిల్లీ ప్రచురించిన హై ఇన్ ది స్కై ఎట్ విష్ణుపదలో 208 సంకీర్తనల ఆంగ్లానువాదంతో పాటు వ్యాఖ్యానం కూడా జతపరిచారు. ఇటీవలే పూర్తిచేసిన మరో పుస్తకం సంకీర్తన ఆజ్ వర్షిప్‌లో మరో 208 సంకీర్తనల ఆంగ్లానువాదం, వ్యాఖ్యానాలతో పాటు తెలుగులో ఆ కీర్తనలు, క్లిష్టపదాల అర్థాలు జోడించడం విశేషం. మరికొన్ని సంకీర్తనల అనువాదాలు సేతు ఆన్‌లైన్ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ పిట్స్ బర్గ్‌లో, మ్యూజిక్ ఇండియా ఆన్‌లైన్ జర్నల్‌లో, సారస పత్రికలలో ప్రచురితమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ విభాగం 2015లో రాగోపాలాచారి అనువాదం చేసిన వల్లభాచార్యులు, ఉత్సవ్ ఆఫ్ లార్డ్ వేంకటేశ్వర అనే పుస్తకాలను ప్రచురించింది. ఇటీవల శ్రీవారి బ్రహోత్సవాలలో జీటి సూరి తెలుగులో రచించిన తిరుమల తిరుపతి క్షేత్ర వైభవం అనే గ్రంథానికి ఆంగ్లానువాదం ఎటర్నల్ గ్లోరీ ఆఫ్ తిరుమల తిరుపతి ష్రయిన్ పుస్తకాన్ని టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామలరావు ఆవిష్కరించారు.


సప్తగిరి సంపాదక బోర్డులో సభ్యుడిగా..

2012 నుంచి 2023 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వివిధ భాషల్లో ప్రచురించే సప్తగిరి మాస పత్రిక సంపాదక బోర్డులో ఆంగ్ల సంచిక సంపాదక సభ్యుడిగా పనిచేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు దాదాపు నిరంతరాయంగా శ్రీవారి వైభవాన్ని తెలిపే వివిధ వ్యాసాలు, అనువాదాలు ఆంగ్లంలో సుమారు 75 వరకు ప్రచురించారు. వీటిలో శ్రీవారి ఉత్సవాల గురించి, అన్నమయ్య సంకీర్తనలలో నాటి వైభవాన్ని, పద్మ సరోవరంలో అలమేలు మంగ ఆవిర్భవించే శోభను వర్ణించే వ్యాసాలు, యువతలో చైతన్యం నింపి వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ గూర్చి తెలిపిన అన్నమయ్య సంకీర్తనలు కొన్నింటిని సీరియల్ రూపంలో విస్డంట్ ఆఫ్ విజిడమ్ శీర్షికతో ప్రచురించారు. శ్రీవారి సేవకే అంకితమైన మరొక వాగ్గేయకారిణి తరిగొండ వెంగమాంబ రచించిన శ్రీ వేంకటాచల మహాత్మ్యం కావ్యం ఆంధ్రానువాదానికి ఆంగ్లానువాదం సీరియల్‌గా ప్రస్తుతం ప్రతీ నెల ప్రచురితమవుతున్నది.

సంక్లిష్టతలను అధిగమించి..

అన్నమయ్య రచనల్లో శాస్త్ర పరిజ్ఞానం, సంగీతం, వేదాంతం, పండుగలు, జానపదాలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తొంగిచూస్తాయి. అనువాదకులకు వాటి పరిచయం అవసరం. తన అనువాదంలో వేంకటేశ్వర స్వామి అలమేలు మంగ వంటి పేర్లను, కేశవ నామాలను అలాగే తీసుకున్న రాజగోపాలాచారి వనజ నాభుడు, లక్ష్మీ కాంతుడు, ఆది దేవుడు వంటి వాటి అర్థాన్ని దృష్టిలో ఉంచుకొని అనువదించారు. అన్నమయ్య పదాల సంక్లిష్టతను వివరిస్తూ వడ్డికాసుల వాడే అన్న పదానికి కుబేరుడి అప్పు తీర్చడానికి భక్తుల నుంచి వడ్డీ రూపంలో కాసులను వసూలు చేసే స్వామి అని అర్థం స్ఫురించేట్టు అనువదించాల్సి వచ్చింది.

అన్నమయ్య ఆత్మావిష్కరణ



తిరుమల తిరుపతి క్షేత్రంపై ప్రచురించిన ఆంగ్లానువాదం

చూడడానికి ఎంతో సులభంగా కనిపించినా 15వ శతాబ్ది రాయలసీమ పలుకుబడి తెలిస్తే కానీ అన్నమయ్య ఉపయోగించిన భాషా ప్రయోగాలు పూర్తిగా అర్థంకావు. తెలుగులో ఎన్నో వ్యాఖ్యానాలు ఉన్నా ఆంగ్లంలో అన్నమయ్య అనువాదాలు కానీ, వ్యాఖ్యానాలు కానీ చాలా తక్కువగా ఉన్నాయని అంటారు రాజగోపాలాచార్య. ఇందులో విలియం జేజాక్సన్ ఎసాంగ్స్ ఆఫ్ త్రి సౌత్ ఇండియన్ సేంట్స్ వెల్చేరు నారాయణ రావు డేవిడ్ షుల్మన్‌ల్ గాడ్ ఆన్ ద హిల్, ఏకె రామానుజన్ వంటి అనువాద రచనలు ఆంగ్ల రచనల వలే కనిపిస్తాయి. కానీ, మన సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించవు. ఇవికాక ఎఎస్ మూర్తి, అడపా రామక్రిష్ణారావు, పప్పు వేణు గోపాలరావు, అంబికా అనంత్‌ల అనువాదాల్లో కొన్ని మన సంస్కృతిని ప్రతిబింబించినా ఆంగ్లానువాదం అంత రక్తికట్టవు. కొన్నేమో మూలాన్ని సరిగా అర్థం చేసుకోవు. అనువాదాలు చేయాల్సినవి చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మన సంస్కృతి, సంప్రదాయాల ఆత్మను ప్రతిబింబిస్తూ ఆచార్య రాజగోపాలచారి చేసిన అన్నమయ్య ఆంగ్లానువాదాలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఐదు విభాగాలుగా...

అన్నమయ్య కీర్తనలను ఇంత వరకు శృంగార, ఆధ్యాత్మిక విభాగాలుగానే చూశారు. కానీ, రాజగోపాలాచారి వీటిని ఐదు విభాగాలుగా విభజించడం విశేషం. ఒకటవ విభాగంలో శ్రీ వేంకటేశ్వర వైభవం అన్న తరగతిలో స్వామి వారి పవిత్ర క్షేత్రాన్ని అర్చా రూప సౌందర్యాన్ని, నామ సంకీర్తనను, ఉత్సవాలను గూర్చి చెప్పి కీర్తనలను వివరించారు. రెండో దానిలో అలమేలు మంగ వైభవం గురించిన కీర్తనలలో ఆమె అతిలోక సౌందర్యాన్ని వివరించే కీర్తనలను, దేవీ దేవేరుల సంభోగ, వియోగ వర్ణణ చేసే కీర్తనలను చేర్చారు. మూడో దానిలో శ్రీ రాముడు, కృష్ణుడు, నరసింహ స్వామి వంటి స్వామి వారి దశావతారాలను వర్ణించే కీర్తనలను చేర్చారు. నాలుగవ దానిలో విశిష్టాద్వైత విభాగంలో శరణాగతి, నైచ్యానుసంధానం, పరమాత్మ, జీవాత్మ, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదనలు, ఆచారాలకు సంబంధించిన కీర్తనలను జోడించారు. చివరిదైన ఐదవ విభాగంలో అస్తిత్వ, ఆధ్యాత్మిక దృష్టిలో జీవన అధ్యయనంలో జీవన స్వభావం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ, సమతావాదంకు సంబంధించిన కీర్తనలు వివరించారు. వ్యక్తిత్వ వికాసాన్ని గూర్చిన అంశాలు త్రికరణ శుద్ధిగా చేసిన పనులను దేవుడు మెచ్చును.. వంటి కీర్తనల్లో కనిపిస్తాయి అంటారు.



మాడభూషణం రాజగోపాలాచారి



సివిల్ సప్లయిస్ గోదాం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నేతలు, హమాలీలు

కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

● ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్

మహబూబాబాద్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : హమాలీ రేట్ల ఒప్పందం జీవోను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్ డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు బుధవారం నిరవధిక సమ్మెకు దిగారు. అందులో భాగంగా బుధవారం తొలిరోజు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయిస్ గోదాం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయలపాటి జక్కరయ్య, లక్ష్మీనారాయణ, వెంకన్న, తిరుపతి, రవి, భూమయ్య, లింగయ్య, అజయ్, సాయి, అశోక్, సరిత. సందీప్ పాల్గొన్నారు.

'మన్మోహన్‌సింగ్‌తోనే దేశం అభివృద్ధి చెందింది'

గార్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో మన్మోహన్‌సింగ్ తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలతోనే దేశం అభివృద్ధి చెందడానికి దోహదపడిందని గార్ల మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం తీసుక వచ్చిన నూతన పాలసీ విధానంతో దేశంలోని ఆర్థిక రంగం బలోపేతం కావడానికి కారణమైందన్నారు. కార్యక్రమంలో షంషాద్‌బేగం, గుండా వెంకట్‌రెడ్డి, మారేడి రమేష్, భాస్కర్, షఫీ, బాలరాజు, పాల్గొన్నారు.



మన్మోహన్‌సింగ్ ఫ్లెక్సీకి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఎస్ఎస్ఏల సమస్యలను పరిష్కరించాలి

● తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ శ్రీనివాస్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షఅభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి, సమ్మె విరమింప చేయాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) రాష్ట్ర కో-కన్వీనర్ ఫైన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో ఉద్యోగులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సమ్మె శిబిరాన్ని టీపీటీఎఫ్ నాయకులతో కలిసి సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తుంటే సర్కారు రెండు సార్లు చర్చలు జరిపి, వారి సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. 2023 సెప్టెంబరులో వరంగల్‌లో ఎస్ఎస్ఏలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ వస్తుంది, వచ్చిన నెలరోజుల్లోనే మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీని ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని సమ్మె చేస్తున్న ఉద్యోగులతో చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి రాజకీయాలకు వెళ్లకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేసి నూతన సంవత్సరంలో వారి జీవితాల్లో వెలుగులు నింపి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘీభావం ప్రకటించిన వారిలో టీపీటీఎఫ్ నాయకులు లింగారెడ్డి, కార్తీక్, మోహన్ ఉన్నారు. ఈ సమ్మెలో ఉద్యోగులు వీరన్న, భాస్కర్‌రావు, ఖాదర్, రంగన్న, కల్పన, మున్నీ, సరస్వతి, ప్రభావతి, రాజశ్రీ, నవీన్, అనిల్, ప్రభాకర్‌చ గణేష్, సైదులు పాల్గొన్నారు.



మానుకోటలోని సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పారిశుధ్య విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు

●మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో పారిశుధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాం మోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో బుధవారం పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాల్లో వేసి పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జవాన్లు శ్రీను, చిరంజీవి పాల్గొన్నారు.

రుణమాఫీని విస్మరించిన ప్రభుత్వం : ఏఐయూకేఎస్

కేసముద్రం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పంట రుణాల్లో రూ.2 లక్షలకుపైగా ఉన్న రైతులకు ఒక్కరికి కూడా రుణమాఫీ అమలు చేయకుండా ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అఖిలభారత యునైటెడ్ రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఫైండ్ల యాకయ్య ఆరోపించారు. కేసముద్రంలో బుధవారం ఈనెల 9న జిల్లా కేంద్రంలో నిర్వహించే డిమాండ్స్ డే ధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ రూ.2లక్షలలోపు ఉన్న రుణాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రైతులంతా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఢిల్లీ రైతాంగ పోరాటం తర్వాత నల్లచట్టాలను దొడ్డిదారిలో కేంద్రం అమలుకు పూనుకోవడం దేశరైతులను అవమానించడమేనని ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల కట్టయ్య, జక్కుల యాకయ్య, పెరుమాళ్ల జానకిరాములు, జంపాల రాంప్రసాద్, వెంకన్న, సురేందర్, మల్లేషం, రాజు, ఎల్లయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



డిమాండ్స్ డే ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

మంత్రులను కలిసిన మానుకోట ఎమ్మెల్యే

మహబూబాబాద్, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అటవీ, పర్యాటక శాఖమంత్రి కొండా సురేఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం. నరేందర్‌రెడ్డిని మానుకోట ఎమ్మెల్యే భూక్యమురళీనాయక్ బుధవారం కలుసుకున్నారు. హైదరాబాద్‌లోమంత్రులు, సీఎం సలహాదారులకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛాలు అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మానుకోట నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖశాంతులతో, అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మానుకోట నియోజకవర్గ నాయకులు రమేష్‌చందర్ రెడ్డి, చౌడవరపు మోహన్‌రావు పాల్గొన్నారు.



నరేందర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్



మానుకోట బ్లెస్డ్ చర్చిలో వేడుకలో పాల్గొన్న ఫాదర్ ప్రేమానందం



అనంతాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నయా జోష్

(5వ పేజీ తరువాయి)

సుఖశాంతులు, అష్టఐశ్వర్యాలతో తులతూగాలని దేవున్ని ప్రార్థించారు. దీంతో నూతన సంవత్సర ప్రారంభం రోజులు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కాగా, క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక పత్యేక ప్రార్థలను నిర్వహించి నూతన సంవత్సర కేక్‌లను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

● మానుకోట పట్టణంలోని తిరుమల నర్సరీ అండ్ గార్డెన్స్ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నిర్వహకులు బండారు వెంకటరమణ, కామ సంజీవరావు తమ సన్నిహితులు, స్నేహితుల మధ్య కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రతాపని బిక్షమయ్య, మానుకొండ విజయ్‌కుమార్, టి.మురళీధరస్వామి, మాఅసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, కళ్లెం వీరారెడ్డి, జీవై.గిరి, మంగలంపల్లి కన్న, బానోత్ రవికుమార్, పాలబిందెల మల్లయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, దర్శనం రామకృష్ణ, ఇనుగుర్తి సుధాకర్, పొన్నాల యుగేందర్, మందుల రఘు, దుడ్డెల రాంమూర్తి, గుడె వీరన్న, రవి, పాల్గొన్నారు.

● మహబూబాబాద్‌లో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావును బీఆర్ఎస్ శ్రేణులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, పుచ్చకాయల రామకృష్ణ, వెంకటాద్రి, మడత వెంకన్న, దేవేంద్రాచారి, రాజేందర్‌గౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ బ్లెస్డ్ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఏసు క్రీస్తు పాటలకు నృత్యాలు చేసిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఏ.ప్రేమానందం, రెవరెండ్ డాక్టర్ స్టెల్లా ప్రేమానందం, కెనాత్ హస్‌బాన్, కెనత్ హాగిన్, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● మరిపెడ షారోన్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరంనూతన సంవత్సరం సందర్భంగా పేదలకు చర్చి పాస్టర్ ప్రభాకర్-కళావతి దంపతులు నూతన దుస్తులు పంపిణీ చేశారు.

● దంతాలపల్లితో పాటు పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

● కేసముద్రం విలేజి ఎన్‌టీఆర్ నగర్ విట్నెస్ ఆఫ్ ట్రూ లైట్ మినిస్ట్రిస్ (డబ్ల్యూటీఎల్ఎం) చర్చిలో బుధవారం వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి మత్తయి, జీవమ్మ, సరిత, భరత్‌భూషన్, చేతి సతీష్, దాసరి ఏకాంబ్రం, కర్ర నర్సింహారెడ్డి, బనిశెట్టి వెంకటేశ్, పూస యాకాంబ్రం, పిల్లి రాము, వేణు, పూస కిరణ్, పవన్, దయాకర్, సారయ్య పాల్గొన్నారు.

ఘనంగా కవిత జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 01 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ కవిత జన్మదిన కేక్‌ను ఎమ్మెల్సీ తక్కెళపల్లి రవీందర్‌రావు కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కెళ్లపల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మహబూబాబాద్ ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసి, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. మునిసిపల్ చైర్మన్ పాల్వా యి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, షేక్. మహబూబ్‌పాష, తేళ్ల శ్రీనివాస్, మార్నేని రఘు, లూనావత్ అశోక్‌నాయక్, దాసరి అర్చిక రావిష్, డౌలగర్ శంకర్, షేక్ ఖలీల్, సలీం, అంబాల శివకుమార్, నర్సింగం వెంకన్న, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, మార్నేని కిరణ్, పొన్నాల యుగేంధర్, అసీఫ్‌అలీ పాల్గొన్నారు.

అలాగే ఇనుగుర్తి మండల కేంద్రం పెద్దబస్టాండ్ సెంటర్‌లో, కేసముద్రం బీఆర్ఎస్ కార్యాలయంలో, గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్‌లో, కురవి వీరభద్రస్వామి దేవాలయంలో, మరిపెడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు కేక్‌ను కట్‌చేసి, పంచారు.



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి 101ఏ
జిల్లా గవర్నర్‌గా కిషోర్‌కుమార్



జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వేమిశెట్టి కిషోర్‌కుమార్

మహబూబాబాద్ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి 101ఏ వరంగల్ జిల్లా గవర్నర్‌గా వేమిశెట్టి కిషోర్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి మాత దేవాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మహబూబాబాద్‌కు చెందిన వేమిశెట్టి కిషోర్‌కుమార్‌ను ఏకగ్రీవంగా నియమించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.టెక్ విద్యార్థి నితీష్‌కుమార్‌కు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడారు. అనంతరం నూతనంగా గవర్నర్‌గా ఎంపికైన కిషోర్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు గంప సాంబమూర్తి, గార్లపాటి శ్రీనివాస్, గార్లపాటి సంతోష్, మంచాల విజయ్‌కుమార్, సబ్బతి నాగభూషణం, మాదంశెట్టి సంపత్‌కుమార్, కుమార్, రామ ఉపేందర్, వైద్యనాథ్ పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం పునఃప్రారంభం

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేసముద్రం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పోస్టాఫీసులో బుధవారం ఆధార్ కేంద్రం సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. గతంలో కాంట్రాక్టు పద్ధతిన ఒక సంస్థకు ఆధార్ కేంద్రం నిర్వహణను అప్పగించగా వారు సరిగ్గా పనిచేయక గత ఏడాది ఆగస్టులోనే ఈ కేంద్రం సేవలు బంద్ అయ్యాయి. ఇదే విషయాన్ని గత అక్టోబర్ 8న 'ఆంధ్రజ్యోతి'లో 'బంద్ అయిన ఆధార్ కేంద్రాలు' శీర్షికన కథనం ప్రచురించగా అధికారులు చర్యలు చేపట్టారు. సదరు కాంట్రాక్టు సంస్థను తొలగించి, పోస్టాఫీసు ఉద్యోగితోనే ఈ కేంద్రాన్ని నిర్వహించేందుకు ఉన్నతాధికారుల అనుమతులు తీసుకొని పునఃప్రారంభించినట్లు నర్సంపేట సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్ తెలిపారు. ఇక నుంచి పోస్టాఫీసులో కొత్త ఆధార్ నమోదులు, సవరణలు, అప్‌డేట్ తదితర సౌకర్యాలను ప్రజలు పొందవచ్చని ఆయన తెలిపారు. నాలుగు నెలల అనంతరంఆధార్ కేంద్రం ప్రారంభంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆధార్ అప్‌డేట్ కోసం ఇంటర్ విద్యార్థిని ఫొటో తీస్తున్న ఉద్యోగి

'నూతన రేట్లను తక్షణం అమలు చేయాలి'

గార్ల జనవరి1 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయిస్, జీసీసీ పనిచేస్తున్న హమాలీలకు సంబంధించిన ఎగుమతులు, దిగుమతుల నూతన రేట్లను తక్షణం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు అంబటి వీరస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఎగుమతులు, దిగుమతుల నూతన రేట్లను అమలు చేయాలని కోరుతూ గోదాం వద్ద హమాలీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను సవరణ చేసి, అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్తారి, సర్వయ్య, ముత్తయ్య, అంజీ, సునిల్, వెంకటేశ్వర్లు, రాంబాబు, రాజేష్, ప్రశాంత్, శివ, వెంకన్న పాల్గొన్నారు.

16 ఏళ్లుగా ప్రారంభించకుండా వదిలేశారు?

●2008 నుంచి నిరుపయోగంగా ఆరోగ్య ఉప కేంద్రం

● మళ్లీ కొత్త భవనం మంజూరుతో ప్రజాధనం వృథా

కేసముద్రం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించే ఆరోగ్య ఉపకేంద్రం కోసం చక్కని భవనాన్ని నిర్మించి, 16 ఏళ్లవుతున్నా ప్రారంభించకుండా నిరుపయోగంగా మారింది. దాదాపు 80 శాతం పూర్తయిన భవనానికి బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో అలాగే వదిశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాలుగు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఈ భవనం నిలుస్తోంది. కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో 2008లో అప్పటి ప్రభుత్వం రూ. 5 లక్షల వ్యయంతో ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టరు భవన నిర్మాణం చేస్తుండగానే అదనపు పనులతో మరో రూ.లక్ష వరకు వ్యయం పెరిగిపోయింది. అయితే ప్రభుత్వం రూ.4.5 లక్షల వరకే బిల్లులు చెల్లించి మిగిలినవి ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు పనిని నిలిపివేశాడు. భవన నిర్మాణం పూర్తి చేయగా ప్రహరీ, రంగులు, వైరింగ్ పనులు చేపడితే ఉపయోగంలోకి వచ్చేది. భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి వైద్య, ఆరోగ్య శాఖకు అప్పగించాల్సిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించారు. ఈ స్వల్ప పనుల కారణంగా పదహారేళ్లుగా చక్కని భవనం నిరుపయోగంగా మారడంపట్ల పాలకుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనానికి మరో రూ.3 లక్షలు కేటాయిస్తే అన్ని హంగులతో వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ దీన్ని పట్టించుకోకుండా తాజాగా మరో భవనాన్ని మంజూరు చేసి నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంపట్ల ప్రజాధనం వృథా చేయడమేనని విమర్శలు గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పదహారేళ్లుగా ఆరోగ్య ఉపకేంద్రం గ్రామపంచాయతీ భవనంలోనే కొనసాగుతోంది. ఇందులో ఒక మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), ఇద్దరు అగ్జలరీ నర్స్ మిడ్‌వైఫ్ (ఏఎన్ఎం)లు ప్రతీ నిత్యం వైద్యసేవలందిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపయోగంగా ఉన్న భవనానికి స్వల్ప నిధులు వెచ్చించి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



ఇంటికన్నెలో నిరుపయోగంగా వదిలేసిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం

భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి

నలమాస సందీప్, ఇంటికన్నె గ్రామస్థుడు



పదహారేళ్లుగా భవనం నిరుపయోగంగా ఉంది. స్వల్ప నిధులు వెచ్చించి భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి. అన్ని హంగులతో ప్రారంభిస్తే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలతో ఉపయోగకరంగా ఉంటుంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సీఐ

పాలకుర్తి (జనగామ జిల్లా), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ మహేందర్‌రెడ్డి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బుధవారం పాలకుర్తిమండలంలోని దర్దెపల్లి శివారులోని గూడేల్లగూడెంకు సైకిల్ వెళ్లిన సీఐ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా వల్ల కలిగే నష్టాలను వివరించారు. మూఢనమ్మకాలపై కూడా ప్రజలను చైతన్య పరిచారు. ఫేక్ కాల్స్, లింక్‌లను ఓపెన్ చేయకూడదని అన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

శబరిమలకు బయలు దేరిన అయ్యప్పస్వాములు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం నుంచి అయ్యప్పస్వామి మాలదారణ గావించిన స్వాములు ఇరుముడి ధరించి, శబరిమలైకు బయలు దేరారు. జిల్లా కేంద్రంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం పట్టణానికి చెందిన స్వాములు ఆలయ ప్రధాన అర్చకుడు మాధవన్ నంబూద్రి వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వాములకు ఇరుముడి గావించారు. ఆలయం నుంచి స్వాములు ఎడ్ల రమేష్, రామసహాయం జైపాల్ రెడ్డి, వంగ అశోక్, దేశబోయిన విజయ్, వెంకన్న, భాస్కర్ స్వాములు కేరళ రాష్ట్రంలోని శబరిమలైకు బయలుదేరి వెళ్లారు.

● గార్ల, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప నామస్మరణతో ఇరుముడి పూజా కార్యక్రమం కన్నులపండువగా సాగింది. నగర సంకీర్తన శ్రీధర్మ శాస్త్ర పీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప మాలలు ధరించిన స్వాములు తమ దీక్షలను ముగించుకొని, ఇరుముడి కట్టుకొని మండల కేంద్రంలోని పురవీదుల్లో పాటలు పాడుతూ శబరిమలై కొండకు బయలు దేరారు. దీంతో దేవాలయం పరిసరాలు బంధుమిత్రులతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో స్వాములు అరుణ్ స్వామి, భిక్షపతి స్వామి, వెంకటేశ్వర్లు స్వామి, ఉపేందర్ స్వామి, కొండల్ స్వామి, తాళ్లూరి రవీందర్ స్వామి, పసుపులేటి రమేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



మానుకోట నుంచి శబరిమలకు బయలు దేరుతున్న స్వాములు

'కొంగొత్త లక్ష్యాలతో ముందుకు వెళ్దాం'

ములుగు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరానికి స్వాగతం పలికి నూతన ఆశయాలు, కొంగొత్త లక్ష్యాలతో ముందుకుళ్దామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లా ప్రజలకు మంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ లోని తన అధికారిక నివాసం ప్రజాభవ న్‌లో కుటుంబ సభ్యులతో కలిసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల నుంచి యువతను విముక్తి చేసేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు.